క్లుప్తంగా

బెజవాడ బార్ అసోసియేషన్‌కు కుర్చీల వితరణ

విజయవాడలీగల్: బెజవాడ బార్ అసోసియేషన్‌కి రూ. 28వేలు విలువచేసే 50 కుర్చీలను శుక్రవారం ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ జాతీయ ప్రధాన కార్యదర్శి చలసాని అజయ్‌కుమార్ వితరణ చేశారు. ఈ సందర్భంగా బీబీఏ అధ్యక్షుడు ఏకే బాషా మాట్లాడుతూ బార్ అసోసియేషన్ న్యాయవాదులు, కక్షిదారుల సౌకర్యార్థం కుర్చీలను బహూకరించడమే కాకుండా బెజవాడ బార్‌కు అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందిస్తున్న అజయ్‌కుమార్‌ను అభినందించారు. కార్యక్రమంలో ఐఏఎల్ రాష్ట్ర డెప్యూటీ జనరల్ సెక్రటరీ ఎంఏ షరీఫ్, బీబీఏ ప్రధాన కార్యదర్శి కేవీ రంగారావు, కోశాధికారి మద్దాడ సత్యనారాయణ, లైబ్రరీ సెక్రటరీ కంచర్ల త్రినాథ్‌కుమార్, గవర్నింగ్ బాడీ సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

పాతశివాలయంలో శంకర జయంతి



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం (పాతశివాలయం)లో ఆదిశంకరాచార్యుల జయంతి మహోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఆలయ అర్చకస్వాములు పర్యవేక్షణలో రాచకొండ నాగరాజుశర్మ తదితరులు ప్రత్యేక పూజలు చేశారు. తొలుత శంకరుల విగ్రహానికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం విశేష అలంకారం చేసి ప్రత్యేక వైదిక కార్యక్రమాలు చేశారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయంలో శంకర జయంతి సందర్భంగా భక్తులకు ప్రత్యేకంగా ప్రసాద వితరణ చేశారు.

నిరుద్యోగ యువతకు స్వయంగా ఉపాధి కోర్సుల్లో శిక్షణ

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): జిల్లాలోని నిరుద్యోగ యువతకు మే నెలలో వివిధ స్వయం ఉపాధి కోర్సుల్లో శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నామని జనశిక్షణ సంస్థాన్ డైరెక్టర్ ఎ.పూర్ణిమ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కటింగ్ అండ్ టైలరింగ్, హ్యాండ్ ఎంబ్రాయిడరీ, ఎలక్ట్రికల్ టెక్నీషియన్ హెల్పర్, ఏసీ అండ్ రిఫ్రిజిరేటర్ మెకానిజం, డ్రస్ డిజైనింగ్, మెషీన్ ఎంబ్రాయిడరీ, హోమ్ క్రాఫ్ట్స్, జామ్ అండ్ జ్యూస్ మేకింగ్, స్మాకింగ్, టీ షర్ట్‌లపై స్క్రీన్ ప్రింటింగ్, చాక్లెట్ మేకింగ్, శారీ ఫోల్డింగ్, ఫ్లవర్ మేకింగ్, మిర్రర్ వర్క్ అంశాల్లో శిక్షణ తరగతులు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు మొగల్రాజపురం రావిచెట్టు సెంటర్‌లో ఉన్న తమ సంస్థ కార్యాలయంలో నేరుగా కానీ 0866-2470420 నంబరులో కానీ సంప్రదించాలని సూచించారు.

'యూజీడీ' లీకులు బాగుచేయండి సారూ..!

- సింగ్‌నగర్‌లో నివాసాల మధ్య పొంగిపొర్లుతున్న మురుగు
- దుర్వాసనతో గగ్గోలు పెడుతున్న స్థానికులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ(యూజీడీ) లైన్ నిండిపోవడంతో మ్యాన్‌హోల్స్ నుంచి మురుగు, వ్యర్థాలు రోడ్లపై ప్రవహిస్తూ స్థానిక ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. వీటి నుంచి వస్తున్న దుర్వాసనలతో ప్రజలు ఇళ్లల్లో ఉండలేని పరిస్థితి నెలకొంది.

పీఅండ్‌టీ కాలనీలో పొంగిపొర్లుతున్న వ్యర్థాలు

స్థానిక 58వ డివిజన్ సింగ్‌నగర్ పీఅండ్‌టీ కాలనీ, స్మైల్ హాస్పటల్ వెనుక రోడ్డు, లెనిన్‌సెంటర్, న్యూరాజరాజేశ్వరీపేట, వాంబేకాలనీ పరిసర ప్రాంతాల్లో పలు చోట్ల యూజీడీ మ్యాన్‌హోల్స్ పొంగిపొర్లుతున్నాయి. మ్యాన్‌హోల్స్ నుంచి వ్యర్థాలు, మురుగు రోడ్డంతా పారుతున్నాయి. వీటి వల్ల రాకపోకలు సాగించేందుకు, ఇంటి బయట కూర్చునేందుకు కూడా వీలుండటం లేదని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యను సంబంధిత సిబ్బందికి ఎన్నిసార్లు చెప్పినా ఒక్కరు కూడా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు యూజీడీ లీకులను గుర్తించి పరిష్కార చర్యలు చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



స్మైల్ హాస్పటల్ వెనుక రోడ్డులో యూజీడీ మ్యాన్‌హోల్ నుంచి పొంగిపొర్లుతున్న మురుగు



పీఅండ్‌టీ కాలనీలో నివాసాల ముందు పారుతున్న వ్యర్థాలు, మురుగు

మ్యాన్‌హోల్స్‌ను సరిచేయాలని వినతులు

ఇందిరానాయక్‌నగర్, తోటవారి వీధి, భరతమాత గుడి రోడ్డు, సింగ్‌నగర్ డాబాకొట్లు సెంటర్ రోడ్డు పరిసర ప్రాంతాల్లో యూజీడీ మ్యాన్‌హోల్స్ కొన్నిచోట్ల రోడ్డుకన్నా కిందకు ఉన్నాయి. వీటి వల్ల బైకులు, సైకిళ్లపై రాకపోకలు సాగించే ప్రయాణికులు నిత్యం ప్రమాదాలకు గురవుతున్నారని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కార్పొరేషన్ ఉన్నతాధికారులు వీటిని కూడా సరిచేయించి రోడ్డు ప్రమాదాల భారినపడకుండా తమకు రక్షణ కల్పించాలని స్థానికులు ప్రాధేయపడుతున్నారు.

మ్యాన్‌హోల్స్ పనులతో ఇబ్బందులు

పాయకాపురం(విజయవాడరూరల్): అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ సిస్టమ్ మ్యాన్‌హోల్స్ రేజింగ్ పనులతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు మధ్యలో యూజీడీ మ్యాన్‌హోల్స్‌ను తవ్వి వదిలేయడంతో వాహనదారుల రాకపోకలకు ఇబ్బందిగా ఉందని, మరమ్మతులను త్వరగా పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు. కండ్రిక, రాజీవ్‌నగర్, సుందరయ్యనగర్ ప్రాంతాల్లో పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. అయితే డ్రెయినేజీ సిస్టమ్ పొంగిపొర్లినప్పుడు రోడ్లపై ప్రవహించకుండా రేజింగ్ పనులు నిర్వహిస్తున్నట్లు వీఎంసీ సిబ్బంది చెబుతున్నారు. గత ఐదు రోజులుగా జరుగుతున్న పనుల వల్ల వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా ఉందని ప్రజలు చెబుతున్నారు.



మ్యాన్‌హోల్ వద్ద తవ్వి వదిలేసిన దృశ్యం

వైభవంగా రామానుజాచార్యులు జయంతి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రామానుజాచార్యుల జయంతి కార్యక్రమాన్ని శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. పాతబస్తీలోని పారేపల్లి రామానుజ కూటం ఆధ్వర్యంలో వేంకటేశ్వరస్వామి వారి దేవస్థాన ప్రాంగణంలో రామానుజాచార్యుల జయంతి నిర్వహించారు. తొలుత రామానుజాచార్యుల విగ్రహానికి పంచామృతాలతో అభిషేకం చేశారు. అనంతరం విశేష అలంకారం చేశారు. అదేవిధంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భజన బృందం ఆధ్వర్యంలో ప్రత్యేక సంకీర్తన నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు పొన్నంగిపల్లి శ్రీరామచంద్రమూర్తి వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు మధ్యాహ్నం ప్రసాద వితరణ చేశారు. రామానుజకూటం వ్యవస్థాపక చైర్మన్ చేబ్రోలు విజయలక్ష్మి కార్యక్రమాలను పర్యవేక్షించారు.

సమతామూర్తి భగవాన్ రామానుజాచార్యులు

విజయవాడ కల్చరల్: సమతామూర్తి భగవాన్ రామానుజాచార్యులు అని కళాపోషకుడు బాడిత శంకర్ పేర్కొన్నారు. చాత్తాద శ్రీ వైష్ణవ కృష్ణానదీ తీర పు రోహిత సంఘం ఆధ్వర్యంలో దుర్గాఘాట్‌లో ప్రత్యేకంగా నిర్మించి వేదికపై శుక్రవారం రామానుజాచార్యుల తిరునక్షత్రం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వ హించారు. ఈ సందర్భంగా బాడిత శంకర్ మాట్లాడుతూ రామానుజాచార్యులు సర్వమానవ సౌభ్రాతృత్రం కోసం కృషి చేసిన మహనీయుడని అభివర్ణించారు. కామ్రేడ్ జీఆర్‌కే సాహితీ సమితి వ్యవస్థాపకుడు గోళ్ల నారాయణరావు మాట్లాడుతూ రామానుజాచార్యులు కులమతాలకు అతీతంగా మానవాళి మనుగడ సాగించాలని బోధించినట్లు గుర్తుచేశారు. హిందూ ధర్మపరిరక్షణ కోసం కృషి చేసిన మహనీయుడని కొనియాడారు. జన హితమే తన మతమని భావించారన్నారు. సహపంక్తి భోజన వ్యవస్థ ఆయనతోనే ప్రారంభమైందని పేర్కొన్నారు. అనంతరం నిర్వాహకులు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో చాత్తాద సంఘ ప్రతినిధులు కొండపల్లి ప్రసాద్, సెటగోపం శ్రీనివాస్, ఇతర సభ్యులు పాల్గొన్నారు.



రామానుజాచార్యులకు పూజలు చేస్తున్న అర్చకుడు



దుర్గాఘాట్‌లో రామానుజాచార్యులకు ప్రత్యేక పూజలు చేస్తున్న చాత్తాద వైష్ణవ సంఘ ప్రతినిధులు

• బస్సుల కోసం పడిగాపులు !

అమరావతిలో ప్రధాని మోదీ సభకు ప్రజలను తరలించేందుకు ఆర్టీసీ బస్సులను ఏర్పాటుచేయదంతో విజయవాడలోని పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్‌లో ప్రయాణికులు అల్లాడిపోయారు. వివిధ ప్రాంతాలకు వెళ్లాల్సిన వందలాది మంది ప్రయాణికులు బస్టాండ్‌లోనే వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఒక్క బస్సు కూడా లేకపోవడంతో దూర పట్టణాలు, నగరాలకు వెళ్లాల్సిన ఎంతో మంది జనం బస్సుల కోసం గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చిన చిత్రాలివి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



బస్సులు లేకపోవడంతో బస్టాండ్‌లోనే నిద్రిస్తున్న దృశ్యం



నిర్మానుష్యంగా మారిన విజయవాడ బస్‌స్టేషన్



బస్సుల కోసం పిల్లలతో సహా బస్టాండుకు వస్తున్న ఓ కుటుంబం



విజయవాడ సిటీ బస్‌స్టేషన్‌లో బస్సుల కోసం ఎదురు చూస్తున్న ప్రయాణికులు



బస్‌స్టేషన్ లోపల బస్సుల కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు

ఆదిపరాశక్తి జగన్మాతకు నృత్య కళార్చన



భవానీపురం(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై గల శ్రీదుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం నూతన రాజగోపురం ప్రాంగణంలోని కళావేదికపై ఆదిపరాశక్తి జగన్మాతకు నృత్య కళార్చన గావించారు. సనాతన ధర్మప్రచారం, లలిత కళలకు ప్రోత్సాహం అందించే దిశగా శుక్రవారం సాయంత్రం విజయవాడ నగరానికి చెందిన కూచిపూడి నృత్య కళాకారిణులు తమ నృత్యాలతో కనకదుర్గ అమ్మవారికి కైమోడ్పులు సమర్పించారు. నాట్యాచారిణి, నృత్య గురువు బీహెచ్ భవానీ నేతృత్వంలో శిక్షణ పొందుతున్న 17 మంది కళాకారిణులు పలు భక్తి కీర్తనలకు లయబద్ధంగా నర్తించారు. తొలుత తాండవ నృత్యకరీ గజానన అంటూ వినాయకుని కీర్తిస్తూ నృత్యాన్ని ప్రదర్శించారు. అనంతరం అమ్మవారిని కీర్తిస్తూ జయజయ దుర్గే అంటూ నర్తించారు. చక్కని ఆహార్యం, ఆంగికాభినయంతో ప్రదర్శించిన నృత్యాలు భక్తులను విశేషంగా అలరించగా హర్షధ్వానాలతో వారిని ప్రశంసించారు. అనంతరం కళాకారుల బృందానికి కనకదుర్గమ్మ అమ్మవారి దర్శనం కల్పించి ప్రసాదాలు అందజేశారు.

ఫుట్ బ్రిడ్జి తొలగింపుతో సమస్యలు తీవ్రం

- రెండు నియోజకవర్గ ప్రజల రాకపోకలకు తలెత్తనున్న ఇబ్బందులు
- ఆందోళనలో ఐదు డివిజన్‌ల ప్రజలు
- వంతెన తొలగింపుతో రైల్వే ఉద్యోగులకూ తప్పని తిప్పలు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): దశాబ్దాల క్రితం వేలాది మంది ప్రజల రాకపోకలకు అనుకూలంగా నిర్మించిన నైజాంగేటు–ఖుద్దుస్‌నగర్ రైల్వే ఫుట్ ఓవర్ బ్రిడ్జి నేడు కనుమరుగవుతోంది. గతంలో వన్‌టౌన్ ప్రాంతం నుంచి గాంధీనగర్ వైపు వెళ్లే ప్రతి ఒక్కరూ ఈ బ్రిడ్జి పైనుంచే రాకపోకలు సాగించేవారు. సమయం కలిసిరావడమే కాకుండా డబ్బు ఆదా అయ్యేది. వించిపేట, నైజాంగేటు, గాంధీబొమ్మసెంటర్, పంజా సెంటర్, ఫోర్‌మెన్ బంగ్లా తదితర ప్రాంతాల నుంచి గాంధీనగర్ వైపుగా వెళ్లే విద్యార్థులు, ఉద్యోగులు, రైల్వే సిబ్బంది ఈ ఫుట్ ఓవర్ బ్రిడ్జిపైనే ప్రయాణించేవారు. తెల్లవారుజాము నుంచి రాత్రి వరకు పాదచారుల రాకపోకలతో ఈ బ్రిడ్జి ఎప్పుడూ సందడిగా ఉండేది.

ఆందోళనలో ఐదు డివిజన్‌ల ప్రజలు

రైల్వే అధికారులు ఫుట్ ఓవర్ బ్రిడ్జిని తొలగించడంతో తమకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని గతంలో ఈ బ్రిడ్జి మీదుగా ఐదు నిమిషాలలో వన్‌టౌన్ నుంచి గాంధీనగర్‌కు నడక మార్గంలో చేరుకునేవారిమని, ఈ బ్రిడ్జి తొలగించడంతో ఇప్పుడు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించి చుట్టు తిరిగి రావాల్సి వస్తుందని స్థానికులు చెబుతున్నారు. గతంలో తమ పిల్లలు గాంధీనగర్‌లోని పాఠశాలలకు, కళాశాలలకు వెళ్లాలన్నా ఈ ఫుట్ బ్రిడ్జి మార్గం ఎంతో అనుకూలంగా ఉండేదని, దీని తొలగించడంతో ఇప్పుడు తమ పిల్లలను ప్రైవేటు వాహనాల్లో పంపించాల్సి వస్తుందని వాపోతున్నారు. కనీసం గతంలో మూసివేసిన కంసాలిపేట–నైజాంగేటు వద్ద ఉన్న లెవల్ క్రాసింగ్ గేటును తెరచి స్థానిక ప్రజల రాకపోకలకు అవకాశం కల్పిస్తే కొంత వరకు తమ ఇబ్బందులు తొలగుతాయని స్థానికులు కోరుతున్నారు.

రైల్వే ఉద్యోగులకూ తప్పని తిప్పలు

ఖుద్దుస‌నగర్‌లోని డీజిల్ లోకోషెడ్డు, రైల్వే కోర్టు, ఐఓహెచ్, డీఆర్‌ఎం కార్యాలయానికి పలు పనుల నిమిత్తం వెళ్లి వచ్చే రైల్వే సిబ్బంది, అదే విధంగా తమ విధులకు హాజరయ్యేందుకు నిత్యం రాకపోకలు సాగించే రైల్వే సిబ్బందికి అటు నుంచి ఇటు రావాలన్నా.. ఇటు నుంచి అటు వెళ్లాలన్నా ఇక తిప్పలు తప్పవని రైల్వే సిబ్బందే బహిరంగంగా చర్చించుకుంటున్నారు. ఇంతమందికి అనుకూలంగా ఉన్న ఈ ఫుట్ బ్రిడ్జిని ఎందుకు తొలగిస్తున్నారో తమకే అర్థం కావడం లేదని రైల్వే సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



కంసాలీపేటలో తొలగిస్తున్న రైల్వే ఫుట్ ఓవర్ బ్రిడ్జి



గతంలోనే మూసివేసిన నైజాంగేటు-కంసాలిపేట ఎల్‌సీ గేటు



సగం కూల్చిన ఫుట్ ఓవర్ బ్రిడ్జి

రాకపోకలకు ఇబ్బందులు పడుతున్న ప్రజలు

నేడు రైల్వే అధికారులు పలు కారణాలు చూపించి ఈ ఫుట్ ఓవర్ బ్రిడ్జిని పూర్తిగా తొలగించే చర్యలు చేపట్టారు. ఇప్పటికే సగభాగం పనులు పూర్తిచేశారు. గంజాయి, అసాంఘిక శక్తులకు ఈ ఫుట్ బ్రిడ్జి అసరాగా మారిందనే కారణం చూపెడుతూ ఈ ఫుట్ బ్రిడ్జిపై నుంచి రాకపోకలు నిలిపివేశారు. దీనిపై స్థానికులు అనేక సార్లు ఆందోళనలు చేసినా రైల్వే అధికారులు అవేమీ పట్టించుకోలేదు. ప్రస్తుతం పూర్తిస్థాయిలో బ్రిడ్జిని తొలగించే చర్యలు చేపట్టారు. ఈ బ్రిడ్జి తొలగించడం వలన వన్‌టౌన్ ప్రాంత వాసులు గాంధీనగర్ వైపు వెళ్లాలంటే చుట్టూ తిరిగి కాశేశ్వరరావు మార్కెట్ వద్ద ఉన్న లో బ్రిడ్జి లేదా చిట్టినగర్ నుంచి కేదారేశ్వరపేట వరకు ఉన్న ఎర్రకట్ట రోడ్డు మీదుగా రావాల్సిన పరిస్థితి తలెత్తుతుంది. దీంతో వన్‌టౌన్ ప్రజలకు సమయం వృథా అవ్వడంతో పాటు వ్యయం కూడా భారీగా చెల్లించుకోవాల్సి వస్తుంది.



చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోంది

గతంలో ఉండే రైల్వే ఫుట్ ఓవర్ బ్రిడ్జిని తొలగింపుతో కంసాలిపేట నుంచి నిత్యవసరాలకు మార్కెట్‌కు వెళ్లాలన్నా, అత్యవసర పరిస్థితిలో ఆసుపత్రికి వెళ్లాలన్నా చుట్టూ తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంటుంది. మాకు పక్కనే ఉన్న పంజా సెంటర్ వెళ్లేందుకు మూడు కిలోమీటర్లు ప్రయాణం చేసి ఎర్రకట్ట మీదుగా తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. నగర పాలక సంస్థ, రైల్వే అధికారులు మా సమస్యలను అర్థం చేసుకుని కనీసం నైజాంగేటు మీదుగా అయినా దారి ఇచ్చేలా చర్యలు తీసుకోవాలి

– బొదిలి తిలక్, కంసాలిపేట



రవాణా ఖర్చులు పెరిగాయి

వేల సంఖ్యలో నివాసముంటున్న కంసాలిపేట, వించిపేట తదితర ప్రాంతవాసుల నగరంలో ఇతర ప్రాంతాలకు రాకపోకలకు సాగించేందుకు గతంలో ఉన్న రైల్వే బ్రిడ్జిని తొలగించడంతో ఇబ్బందులు ఎదుర్కుంటున్నాం. కనీసం ఇక్కడ ఉన్న ఎల్‌సీ గేటు కూడా మూసివేయడంతో మా పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది. రైల్వే అధికారులు స్పందించి నైజాంగేటు ఎల్‌సీ గేటు అందుబాటులోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలి.

– దాసరి ఏసు, స్థానికుడు

కిశోర వికాసంపై అవగాహన

పాయకాపురం(విజయవాడరూరల్): మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కౌమార దశలోని బాలికలకు విద్య ప్రాముఖ్యత, ఆరోగ్యం, వ్యక్తిగత అవసరాలపై అవగాహన కల్పించే కిశోర వికాసం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. పాయకాపురం, కండ్రిక, రాజీవ్‌నగర్ ప్రాంతాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా కిశోరి విద్య, సంపూర్ణ ఆరోగ్యం, రుతు పరిశుభ్రత, పౌష్టికాహారం, అక్రమ రవాణ, పోక్సో చట్టం, బాల్యవివాహాల నిషేధ చట్టం, ఆత్మరక్షణ, మెగా జీవనోపాధి అవకాశాలు, ఆర్థిక నిర్వహణ వంటి అంశాలను వివరించారు. కార్యక్రమాల్లో ఐసీడీఎస్ ప్రాజెక్ట్ విజయవాడ అర్బన్ ఏసీడీపీఓ డీ జ్యోత్స్న, సూపర్‌వైజర్ వీ నాగమణి, ఐసీడీఎస్ సోషల్ వర్కర్ శారద, చైల్డ్‌లైఫ్ ప్రతినిధులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



పాయకాపురంలో అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

రేపు ప్రపంచ నవ్వుల దినోత్సవం

లబ్బీపేట(విజయవాడతూర్పు): విజయవాడ లాఫింగ్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నవ్వుల దినోత్సవం జరుపుకొంటున్నట్లు ఆ క్లబ్ వ్యవస్థాపకుడు తొండెపు హనుమంతరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏటా మే మొదటి ఆదివారం ప్రపంచ వ్యాప్తంగా నవ్వుల దినోత్సవాన్ని నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ ఆధునిక ప్రపంచంలో తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురవుతున్న ప్రజానీకానికి నవ్వడం అనేది ఒక దివ్య ఔషధమని అన్నారు. దీని ద్వారా వారు ఉల్లాసాన్ని పొందగలుగుతారని చెప్పారు. 'మనం ఆనందంగా ఉండబట్టి నవ్వడం లేదు.. మనం నవ్వుతున్నాం కాబట్టి ఆనందంగా ఉన్నాం' అనేది తమ స్లోగన్‌గా పేర్కొన్నారు. ఈ నవ్వుల దినోత్సవంలో విజయవాడ ప్రజలందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు.

చిన కంచిలో ప్రత్యేక పూజలు

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలో చంద్రశేఖరేంద్ర సరస్వతీ స్వామి దేవస్థానం చినకంచిలో శ్రీ ఆదిశంకరాచార్యుల వారి జయంతి సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆరుద్ర నక్షత్రం ఆదిశంకరాచార్యుల వారి జన్మనక్షత్రం కావడంతో చినకంచిలో ఆదిశంకరాచార్యుల విగ్రహానికి భక్తులు అధిక సంఖ్యలో అభిషేక అర్చనలు నిర్వహించారు. వేద విద్యార్థులు ఉపనిషత్తుల పారాయణ చేశారు.